నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట మండలాల్లో ఏనుగు ప్రవేశించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైన తెలిపిన మండలాలతోపాటు చుట్టుపక్కల మండలాలైన దహెగాం, కౌటాల మండలాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎవరు కూడా ఒంటరిగా పొలాల వైపు వెళ్లకూడదని తెలిపారు. ఒంటరిగా ఇండ్ల నుంచి ఎవరూ బయటకు రాకూడదని, భయాందోళనకు గురికావాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాల ద్వారా ఏనుగు జాడ కోసం ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నార్నూర్ : గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనీ ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలన్నారు. ప్రతి గర్భిణీపై దృష్టి పెట్టాలని, హైరిస్క్‌తో ఉన్న గర్భిణిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ రాంబాబును ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎండా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త గా ఉండాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త తప్పకుండా తమ దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు పెట్టుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సిహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ తులసీదాస్, వైద్యసిబ్బంది సుశీల, హెల్త్ సూపర్వైజర్ సత్తవ్వ, చౌహన్ చరణ్‌దాస్, హిమబిందు, ప్రియాంక పాల్గొన్నారు.



విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్

ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారులను ఆదేశించారు. ఫుడ్ పాయిజన్‌తో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సాపూర్(జి) కేజీబీవీ విద్యార్థులను గురువారం ఆయన పరామర్శించి వైద్యులకు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన 26మంది విద్యార్థులకు అత్యవసర వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించడం జరిగిందని, తల్లిదండ్రులెవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి పూర్తి విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గూడెన్‌ఘాట్, తుంపెల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేనిఫెస్టోలో చెప్పినట్టు ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లోనే అమలు పరిచి చూపించిందన్నారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారం చేపడితే మహిళలకు, ఆదివాసులకు, ఎస్సీలకు, మైనారిటీలకు, ఓబీసీలకు, రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మసాడే చరణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ ఎంపీపీ బొమ్మన బాలేష్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సలీం, సమీర్, ఎంఎ రఫిక్ పాల్గొన్నారు.

వన్ నేషన్ వన్ పర్మిట్ నిబంధన అమలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అటవీ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా వన్ నేషన్ వన్ పర్మిట్ అనే నిబంధనలను అమలు చేస్తున్నట్లు బాసర సర్కిల్ సిసిఎఫ్ శరవనన్ అన్నారు. గురువారం నిర్మల్ అటవీశాఖ కార్యాలయంలో సామిల్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్ర కొనుగోలు చేసిన వారికి సామిల్ యజమానులే పర్మిట్ ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పద్ధతి లేదన్నారు. సామిల్ యజమానులు కర్రను విక్రయించినప్పుడు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ పంట పొలాలలోని టేకు, ఇతర చెట్లను తొలగించాలన్నా ఆన్‌లైన్‌లో అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుందని వివరించారు. సామిల్ యజమానులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా వేసవికాలంలో అడవులకు నిప్పు పెట్టడం ప్రమాదకరమన్నారు. పశువుల కాపర్లు, ఇప్పపువ్వు సేకరణ కోసం వెళ్లేవారు ఇతరత్రా పనుల కోసం అడవికి వెళ్లేవారు అడవులకు నిప్పు పెడుతున్నారని, దీనిపై స్థానిక అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్ డీఎఫ్ఓతో పాటు జిల్లా అటవీ అధికారులు పాల్గొన్నారు.

అటవీ జంతువులతో.. భయం..భయం..!





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అటవీ జంతువులు వణికిస్తున్నాయి. పశువులపైనే కాకుండా మనుషులపై కూడా దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది. గతేడాది పెద్దపులి మనుషులపై పంజా విసరగా.. ఈ ఏడాది ఏనుగు దాడిలో ఇద్దరు మృతి చెందడం పట్ల పరిసర ప్రాంతాల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. ముఖ్యంగా అటవీ ప్రాంతం అధికంగా ఉండే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తరుచూ అటవీ జంతువులు దాడులు చేస్తుండటం స్థానికంగా ఆందోళన రేకెత్తిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏటా పెద్దపులులు, చిరుతలు, ఇతర జంతువులు పశువులపై దాడి చేయడం సాధారణ విషయంగా మారినా.. మనుషులపై కూడా దాడి చేస్తుండటం భయాందోళన కలిగిస్తోంది. అటవీ ప్రాంతానికి ఆనుకొని వ్యవసాయం చేస్తున్న రైతులు..ఎటువైపు నుంచి ఏ జంతువు వచ్చి దాడి చేస్తుందోనని నిత్యం ఆందోళన చెందుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ముఖ్యంగా ఇది వరకు పులి దాడిలో మనుషులు చనిపోగా.. జిల్లా చరిత్రలో తొలిసారి ఏనుగు దాడిలో మృత్యువాత పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

- కుమురంభీం జిల్లాలో తరుచూ వన్య ప్రాణుల దాడులు
- తాజాగా ఏనుగు దాడిలో ఇద్దరు మృతి
- గతేడాది పెద్దపులి.. తాజాగా గజరాజు దాడి
- ఇంకా లభించని ఆచూకీ..ఆరా తీస్తున్న అధికారులు
- పరిసర గ్రామాల్లో అప్రమత్తం..144సెక్షన్ అమలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, చింతలమానేపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవితో కూడుకున్నది. ఇక్కడ అనేక రకాల జంతుజాలం ఉన్నప్పటికీ.. ఏనుగు జాడలు మాత్రం కనిపించలేదు. ప్రతి ఏటా జిల్లా వాసులను పెద్దపులి, చిరుతలు మనుషులు, పశువులను భయపెట్టడమే కాకుండా.. వాటి దాడిలో పలువురు మృత్యువాతపడిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఏనుగు దాడి చేయడం మాత్రం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఇది వరకు ఏనుగు సంచరించిన చరిత్ర కూడా లేదు. తాజాగా ఈ ఏనుగు చత్తీష్‌గడ్ నుంచి మహారాష్ట్ర అటవీ ప్రాంతం మీదుగా జిల్లాలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఏనుగు 24గంటల వ్యవధిలోనే ఇద్దరిని హతమార్చటం సంచలనంగా మారింది. ఈ పరిసర ప్రాంతాల ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదిని దాటి చింతలమానేపల్లి మండలంలోకి ప్రవేశించిన ఏనుగు బుధవారం బూరెపల్లి గ్రామానికి చెందిన శంకర్ మిర్చి పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా దాడి చేసి చంపేసింది. అక్కడ్నుంచి పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లింది. ఈ గ్రామానికి చెందిన రైతు కారు పోచయ్య గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి పంట పొలానికి వెళుతుండగా రోడ్డుపక్కనున్న ఏనుగు ఒక్కసారిగా ఆయనపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందడం కలకలం రేపింది.



ఏనుగు ఆచూకీ కోసం గాలిస్తున్న అటవీ అధికారులు

గతేడాది పెద్దపులి భయం..!

కుమురంభీం జిల్లాలో గతేడాది పెద్దపులి మనుషులపై దాడి చంపేయడం సంచలనం రేకెత్తించింది. దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విఘ్నేష్‌పై పంజా విసిరి చంపేయగా.. ఇదే జిల్లాలోని పెంచికల్‌పేట మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల పత్తి చేనులో పనులు చేస్తుండగా ఒక్కసారిగా దాడి చేసి చంపేసింది. ఇక ఈ ప్రాంతంలో ఎద్దులు, ఆవులు, గేదెలు వన్యప్రాణుల భారిన పడటం సాధారణంగా మారుతోంది. జిల్లాలోని అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం అధికంగా పెద్దపులల జాడ మాత్రం అంతంత మాత్రమే. కిందటేడాది భీంపూర్ మండలంలోని గొల్లఘాట్, తాంసి, పిప్పల్‌కోటి తదితర గ్రామాల సమీపంలోకి వచ్చిన పెద్దపులులు పశువులపై దాడి చేశాయి. ఇలా పంట పొలాలు, గ్రామాల సమీపాల్లో వన్య ప్రాణుల సంచారం పరిసర గ్రామాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

ఆ మండలాల్లో అలర్ట్..!

ఏనుగు సంచారంతో కుమురంభీం జిల్లాలోని పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి, బెజ్జూర్, కౌటాల మండలాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గురువారం తెల్లవారుజామున పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామానికి అతి సమీపంలో వ్యక్తిని హతమార్చిన ఏనుగు తదనంతరం ఎటువైపు వెళ్లిందో జాడ తెలియడం లేదు. వ్యక్తిని చంపిన విషయం తెల్లవారుజామునే దావణంలా వ్యాపించినా అటవీ అధికారులు సత్వరం స్పందించలేదనే విమర్శలున్నాయి. పెంచికల్‌పేటలోనే అటవీ రేంజ్ కార్యాలయం ఉండగా ఘటన జరిగిన వెంటనే అధికారులు స్పందించినట్లయితే ఏనుగు జాడ ఇప్పటి వరకు తెలిసి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏనుగు పెద్ద జంతువు కావడంతో వాటి అడుగులు కూడా భారీ స్థాయిలోనే ఉంటాయని గుర్తించడంలో మాత్రం అలసత్వం వహిస్తున్నారని మండిపడుతున్నారు. మరోపక్క ఆ శాఖ ఉన్నతాధికారులు, అటవీ అధికారులు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పెంచికల్‌పేట్ నుంచి బెజ్జూర్‌లోని సలుగుపెల్లి వైపు వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. పరిసర గ్రామాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతుండగా.. ఏనుగు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏనుగు దాడిలో మృతి చెందిన అల్లూరి శంకర్, ఫైల్ ఫోటో(ఇన్‌సెట్‌లో)

మిషన్ భగీరథ..ఏమిటీ వ్యథ..!

ప్రతి ఏటా ఇదే గోస..ఎండాకాలం రాగానే భూగర్భ జలాలు అడుగంటి గుక్కెడు నీటి కోసం బిందె మీద బిందె పెట్టి బావులకు, వాగులకు, చెలిమెలకు కోసుల దూరం వెళ్లాల్సిందే. ఇది ఏజెన్సీలోని మారుమూల గూడెల్లోని ఆదివాసుల ఇబ్బందులు. ఇటీవలే జిల్లా కలెక్టర్ తాగునీరు, ఇతర శాఖల అధికారులతో నీటి ఎద్దడి తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని, బావి నీళ్లు తాగడానికి వాడకూడదని సమావేశం నిర్వహించారు. అయినా సంబంధిత శాఖ అధికారుల్లో చలనం రాలేదు.

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- బిందెడు నీళ్ల కోసం కోసుల దూరం పయనం
- అందని మిషన్ భగీరథ నీళ్ల
- అలంకార ప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు
- ముస్ముందు గడ్డుకాలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని వాల్గొండ, ఖైర్‌గూడ, మామిడిగూడ(జి), జైత్రాంతండా, పాటగూడ, దొడంద, గట్టేపల్లి, చిలాటిగూడ, కోలాంగూడ, హర్కాపూర్, అందుగూడ, సాలెగూడ, దుబ్బగూడ, దస్నాపూర్‌గూడ, మల్కుగూడ తదితర గ్రామాల్లో నీటి ఏద్దడి తీవ్రంగా ఉంది. ఈ గామాల్లో మిషన్ భగీరథ నీళ్ల వారానికి ఒకసారి రాగా మరికొన్ని గ్రామాల్లో నీళ్లే రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అనేక గ్రామాల్లో పైప్‌లైన్‌లు పగిలిపోయి లీకేజీల పర్వంగా మారిందని తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. మామిడిగూడ(జి)లో మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదు. మిషన్ భగీరథ ద్వారా రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తాగు నీటి కోసం గ్రామ పొలిమేరలో కోసుల దూరంలో ఉన్న వాగులు, బావుల నుంచి బిందె మీద బిందె పెట్టి నీటిని మోసుకొస్తున్నామని గ్రామస్తులు పెందూర్ శేకు, వెట్టి ఇస్రు ఆవేదన వ్యక్తం చేశారు. జైత్రాంతండాలో గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ నీటి పథకం ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో గ్రామస్తులు ఫర్లాంగు దూరంలో ఉన్న వాగు నీటినే తాగు నీరుగా వాడుతున్నామని పేర్కొంటున్నారు. వాల్గొండలో కరెంటు ఉంటేనే గ్రామంలో ఉన్న చిన్న ట్యాంకుకు నీటిని సరాఫరా చేసి తాగు నీరుగా వాడుతున్నారు. ఇతర అవసరాల నీళ్ల కోసం బండెనక బండి కట్టి గ్రామ పొలిమేరలో ఉన్న బావి నుంచి తెచ్చు కావాల్సిందే. దొడంద, గట్టేపల్లి, చిలాటిగూడ, కోలాంగూడ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పొలిమేరల్లో ఉన్న బావులు, చెలిమెల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇక సాలెగూడ, జనతాగూడ, హర్కాపూర్, శంకర్‌గూడతో పాటు అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి పోవడంతో తాగు నీరు అందడం లేదు.



వ్యవసాయ బావి వద్ద నీళ్ల తోడుకుంటున్న గిరిజనులు



బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజన యువతులు


ముందున్నది గడ్డుకాలం

ఏజెన్సీ గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రూ.650.30 లక్షలకు పరిపాలన అనుమతులు మంజూరు లభించింది. దీని ద్వారా ఇంద్రవెల్లి మండలానికి రూ.96 లక్షలతో 31 ఆవాస ప్రాంతాల్లో తాగు నీటి పనులు చేపట్టనున్నారు. వీటిలో కొన్ని గ్రామాల్లో బోర్‌వెల్ తో పాటు పైప్‌లైన్ పనులను చేపట్టనున్నారు. ఏదేమైనా ఇంక రెండున్నర నెలల పాటు తీవ్ర మండుటెండలు ఉండే అవకాశమున్నందున భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశముంది. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండి తాగు నీటి చర్యలు చేపట్టకపోతే ముస్ముందు గడ్డు కాలం రానుంది.



ఎడ్ల బండ్ల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజనులు

సొంతంగా బోర్‌వెల్ వేయించుకున్నాం : వెట్టి ఇస్రు, మామిడిగూడ



తమ గ్రామానికి వాగువద్ద హ్యాండ్ బోర్‌వెల్ ఉన్నా నీళ్ల రావడం లేదు. దీంతో ఇంటింటికీ కొంత డబ్బులు జమ చేసి బోరు వేసుకున్నాం. కానీ నీరు పడలేదు. దీంతో గ్రామ పొలిమేరలో ఉన్న బావి నీటినే తాగుతున్నాం

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు : బత్తిబాయి, జైత్రాంతండా



యాభై కుటుంబాలు నివసించే తమ తండాకు 3నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదు. గ్రామంలో ఉన్న హ్యాండ్ బోర్‌కు నీళు రావడం లేదు. దీంతో ఫర్లాంగు దూరంలో ఉన్న వాగు నీటినే వాడుతున్నాం.

పాఠశాల వసతులను తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని కాప్రి గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాలలోని వసతులను ఎంపీడీఓ రవీంద్రనాథ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలోని మరుగుదొడ్లను, తాగునీటి సరఫరా ఇతర మరమ్మత్తుల గూరించి పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చైర్మన్ ఏల్మ సుజాత, నాయకులు వెంకట్ రెడ్డి, ఏపీఓ ఉన్నారు.

పాఠశాలకు రూ.50 వేల వస్తువుల విరాళం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



సొంత ఊరికి, చదువుకున్న పాఠశాలకు పీచర గ్రామస్తుడు మాచ్చేందర్ రెడ్డి తన వంతు సాయంగా చేశారు. గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు గురువారం రూ.50వేలు విలువ చేసే పుస్తకాలు, బీరువా, దుస్తులు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మచ్చేందర్ రెడ్డిని గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ, విద్యారాణి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర, చరిత్ర విభాగం విద్యార్థులు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని ధనోర గ్రామ సమీపంలోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో ఆపిల్ తోటలను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. సీనియర్ వృక్ష శాస్త్ర అధ్యాపకులు ప్రిన్సిపల్ డా.వరప్రసాద్ రావు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆపిల్ పంటల సాగు చాలా అరుదని తెలిపారు. ఆపిల్‌తో పాటు వాటర్ ఆపిల్ ఇంకా అనేక పంటలను ఇక్కడ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నార్నరు. రాబోయే తరాలకు కొత్తకొత్త పంటలు సాగు చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. అదే విదంగా చరిత్ర విద్యార్థులు జోడేఘాట్‌లోని భీమ్ సమాధి, మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.గెడం ప్రవీణ్, అధ్యాపకులు ఆమోల్, సంజీవ్, బిందు, సౌందర్య హెర్బరియం, అర్చన పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్టపణలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రిక్షా కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం శ్రీ రాములవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఘన స్వాగతం పలికి, ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విగ్రహాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాయల్ మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగిందని అలాగే ఆదిలాబాద్‌లో రామ మందిరం నిర్మాణం జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ మహోన్నత ఘట్టాన్ని తరతరాల వరకు గుర్తుంచుకుంటారన్నారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఆదినాథ్,విజయ్, అశోక్, సూర్య శివ, బుమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయంతి వేడుకలను విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బాబు జగ్జీవన్‌రాం 117వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ బారిక్ రావ్ మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం చౌక్‌లో నిర్వహించే ఈ వేడుకలకు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతిని అంబెద్కర్‌చౌక్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ జయంతి వేడుకలను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాందాస్ జిల్లా అధ్యక్షుడు మాల్యాల స్వామి నాయకులు పాల్గొన్నారు.

వింత పద్ధతిలో తరలిస్తున్న దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వింత పద్ధతిలో దేశీదారును తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సమాచారంతో రైల్వే స్టేషన్ దగ్గర గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మునీశ్వర్ సత్యనారాయణ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అతన్ని తనిఖీ చేయగా షర్ట్ లోపల చిన్నచిన్న జేబులు కుట్టించుకున్న జాకెట్ ధరించి ఉన్నాడు. అందులో 48 దేశిధారు బాటిల్స్ దొరికాయి. దీంతో దేశిదారును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఇన్స్‌పెక్టర్లు గంగారెడ్డి, అక్బర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్స్ రవి సాయి, కానిస్టేబుల్స్ సందీప్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో శుక్రవారం ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవి విద్యుత్ లైన్ మరమత్తు చేపడుతున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

అత్యవసర సేవ శాఖల

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

- కలెక్టర్ రాజర్షి షా
- ఏప్రిల్ 15లోగా దరఖాస్తు అందజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎసెన్షియల్ సర్వీస్(ఏవిఈఎస్) ఉద్యోగులకు ఎలక్షన్ కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించినందున ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎసెన్షియల్ సర్వీస్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్ శాఖ, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం, పౌరసరఫరాల శాఖ, ఎస్‌ఎన్‌ఎల్, అగ్నిమాపక సేవ ఉద్యోగులు, పోల్ డే కవరేజ్ కోసం ఈసీఐ ద్వారా అధికారం పొందిన మీడియా మిత్రులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ఎసెన్షియల్ సర్వీస్ ఉద్యోగులు ఫారం-12(డి) తీసుకొని నింపి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తులను సంబంధిత శాఖల నోడల్ అధికారులు ఏప్రిల్ 15లోగా సమర్పించాలని సూచించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల సర్వీసెస్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల, జిల్లా వైద్యాధికారి నరేందర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి హరింద్ర కుమార్, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, డిఎం సుధారాణి, ఫైర్ ఆఫీసర్ కృష్ణ మూర్తి, జనరల్ మేనేజర్ దేవదాస్, స్టేషన్ మాస్టార్ కుముద్, ఆర్టీసీ డీఎం కల్పన పాల్గొన్నారు.



బాధితులకు అండగా సైబర్ వారియర్స్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాధితులకు అండగా సైబర్ వారియర్స్ ఉంటారని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్ కేటాయించినట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక్కొక్కరి చొప్పున సైబర్ వారియర్స్‌ను కేటాయించినట్లు తెలిపారు. సైబర్ వారియర్స్‌కి ప్రత్యేకంగా ఒక సెల్ ఫోన్ సిమ్ కార్డ్ అందజేశామని తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 ఫోన్ నెంబర్‌కు గాని, ఎన్సీఆర్పీ పోర్టల్, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరం ద్వారా మోసపోయిన డబ్బును త్వరగా ఇప్పించే విధంగా నూతన పద్ధతిని సైబర్ వారియర్స్‌కు తెలియజేయడం జరిగిందని, పూర్తి అవగాహనతో కోర్టు ద్వారా వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇదివరకే సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు ఎవరన్నా ఉంటే వారి డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉంటే సైబర్ వారియర్స్ ఉపయోగకరంగా వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్రావు, డిసిఆర్బి ఇన్స్‌పెక్టర్ పి ప్రసాద్, సైబర్ సెల్ ఇన్‌చార్జి సింగజ్ వార్ సంజీవ్ కుమార్, ఎంఏ రియాజ్, జిల్లా సైబర్ సెల్ వారియర్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్‌లో పాల్గొనడం అభినందనీయం

నవతెలంగాణ-ఉట్నూర్



నిత్య జీవితంలో గణితం ఉపయోగాలు అనే అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస ప్రాజెక్టులో పాల్గొనడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జాడి రవి కిరణ్ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన గణిత అధ్యాపకురాలు డాక్టర్ శ్రావణి, ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు పూజ, చంద్రకళ, నగేష్, శేఖర్, అమృత్‌లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి గణితం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గణితం ఉపయోగాలపై తమ కళాశాల విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లోని రూసా రిసోర్స్ సెంటర్‌లో జిజ్ఞాస రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొన్నారన్నారు. విద్యార్థులు అందరూ గణితం సబ్జెక్ట్‌ని కష్టపడకుండా ఇష్టంతో చదివినప్పుడు అన్ని సాధ్యమవుతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఐ.శ్రావణి పేర్కొన్నారు. ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా ప్రదర్శించి సర్టిఫికెట్ పొందడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇలాంటి రాష్ట్రస్థాయి ప్రోగ్రాంలలో మరిన్ని ప్రాజెక్టులు నిర్వహించి అందరి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా. జె. సంగీత, శ్రీధరా దేవి, రాణి, రాజశేఖర్, డా.రవీందర్, రాజ్ కుమార్, శ్రీనివాస్, జావిద్ పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని బట్టిసవర్గాం కుమురంభీం కాలని ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని తుడుందెబ్బ నాలయకులు డిమాండ్ చేశారు. గురువారం కాలనిలో పలువురి సహకారంతో ఏర్పాటు చేసిన కులాయిలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పట్టాలు, నీళ్లు, కరెంటు, రోడ్డు సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయిందని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కుమురంభీం కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న ఆదివాసులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అనేక దర్నలు రాస్తా రోకోలు ర్యాలీలు చేపట్టినప్పటికీ అధికార యంత్రాగంలో చలనం రాలేదన్నారు. ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందేబ్బ కుమురంభీం కాలనీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 17 నీటి నల్లాలు, 5 బోర్లు, ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదిలాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుందరావు, ఆత్రం భుజంగరావు, తొడసం ప్రకాష్, కుమ్ర గోవింద్ రావు, గేడం ఆనంద్ రావు, ఆత్రం శివ, బందుకే బలిరాం పాల్గొన్నారు.

కొత్తూరు, కప్పర్‌దేవి గ్రామాల్లో పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొత్తూరు, కప్పర్ దేవి గ్రామాల్లో గురువారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పశువులకు గాలు కుంటివ్యాధితో పాటు ఇతర వ్యాధులకు టీకాలు, మందులు పంపిణి చేశామని పశు వైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ తెలిపారు. పాడి రైతులు పశువులకు గాలి కుంటి వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని సూచించారు. ఎండాకాలంలో పశువులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తాగునీరు, పశుగ్రాసం అందించాలన్నారు. పశువైద్య శిబిరంలో గోపాలమిత్ర సౌమ్య, ఆశన్న, గ్రామస్తులు గంగారాం, ఆశన్న, శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సెడ్మాకి ఆనంద్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలోనిపార్టీ కార్యాలయంలో ఆదివాసీ, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థిగా ఆదివాసీ ఆడ బిడ్డ ఆత్రం సుగుణక్కను భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. అధిష్టానం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి చరిత్రలోనే మొదటి సారిగా ఆదివాసీ ఆడ బిడ్డ, ఓ సాధారణ ఉపాధ్యాయురాలికి టికెట్ ఇచ్చిందన్నారు. పార్లమెంట్ టికెట్ ఇచ్చి గౌరవిస్తే మనం ఆమెను భారీ మెజారిటీతో గెలిపించి, భావి భారత ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, తెలంగాణ తల్లి సోనియాగాంధీకి బహుమానం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ రావ్ వాంఖడే, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, గావండే ఘనశ్యామ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు కుర్సెంగ తానాజీ, మాజీ సర్పంచ్ పేందుర్ మోహన్, మేస్రం భీర్షావ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిపై రాముని దీవెనలు ఉండాలి

- విగ్రహప్రతిష్టపణలో పాల్గొన్న మాజీ మంత్రి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శ్రీ రాముడి కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగురామన్న ఆకాంక్షించారు. గురువారం పట్టణంలోని రిక్షా కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ ప్రతిష్టపణలో జోగురామన్నతో పాటు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు వారికి స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపి వారి ఆశీర్వచనాలు స్వీకరించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందచేసిన సుభద్ర బాయిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాలనీలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. వేడుకల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ఆవుల వెంకన్న, కొండ గణేష్, రాంకుమార్, ధమ్మపాల్, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

అంధ విద్యార్థికి టాబ్లెట్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అనిల్ అంధ విద్యార్థి పై చదువుకు గురువారం ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా టాబ్లెట్ ఫోన్‌ను అందజేశారు. విద్యార్థి తండ్రి శంకర్ పీఓకు ధన్యవాదాలు తెలిపారు.



భూసార పరీక్షలపై అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని ఆరెగూడెం గ్రామంలో గురువారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ కాటకం ప్రసాద్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని, భూసార పరీక్ష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ అగ్రోనమిస్ట్ ప్రీతం రెడ్డి, మార్కెటింగ్ డెవలప్మెంట్ ట్రైని రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

మహిళల సంరక్షణ కోసమే షీ టీమ్స్

నవతెలంగాణ-కెరమెరి



మహిళలలు, బాలికల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. పాఠశాల విద్యార్థినులతో అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాల బాలికల మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా 8712670564కు ఫోన్ చేయాలన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి ప్రజలు సహకరించాలి


- అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు



నవతెలంగాణ-వాంకిడి

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు, వర్గ బేదాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేల ప్రజలు సహకరించాలని అదనపు ఏఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కమాన గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ గైడ్‌లెన్స్ ప్రకారం ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా దేవాలయాలు, మసీదు, చర్చిలు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల గోడలపై ఎన్నికల ప్రచారం చేయరాదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు ఇచ్చే మద్యం, డబ్బులు, ప్రలోభాలకు ప్రజలు గురికావొద్దన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం కమాన గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సదర్శించారు. ఆయనతో పాటు డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు సాగర్, రాములు పాల్గొన్నారు.

ఏనుగు పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మహారాష్ట్ర ప్రాణహిత నది దాటి వలస వచ్చిన ఏనుగు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. బూరెపల్లి గ్రామంలో మిర్చి రైతుని హత్య మార్చిన విషయం తెలిపారు. పొలాలకు ఎవరు కూడా వెళ్లొద్దని, తప్పనిసరి అయినట్లయితే గుంపులుగా వెళ్లాలని సూచించారు. ప్రస్తుం మండల అటవీ ప్రాంతలోకి వెళ్లిందని, అటవీ పరిసర గ్రామాలలో అటవీ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది ఏకంగా డీజేతో గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఇప్పటికే ఏనుగుతో రెండు ప్రాణాలు బలికొనగా, మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు సందర్శించి, తహసీల్దార్ నాగరాజ్ గౌడ్, రెవెన్యూ సిబ్బందితో సమావేశం అయ్యారు. ప్రజలకు ఏనుగు నుండి ఎటువంటి హాని కలుగు రాదని మండలంలో 144 సెక్షన్ విధించినందున, ప్రజలు తప్పనిసరి అయితేనే బయటికి వెళ్లాలి, లేదంటే ఇంట్లోనే ఉండాలని అన్నారు.

కౌటాలలో 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-కౌటాల

మహారాష్ట్ర నుండి ఏనుగు చింతలమానెపెల్లి మండలం బూరేపల్లికి రావడంతో అక్కడ పంట చేనులో పనిచేస్తున్న రైతుపై దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడి నుండి గురువారం ఉదయం పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి గ్రామానికి చెందిన రైతు మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టడానికి మోటారు వేయడానికి వెళ్లగా ఆయనపై దాడిచేసి బలితీసుకుంది. ఈ విషయం తెలుసుకున్న కుమురం భీం ఎస్పీ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయగా అందులో భాగంగా కౌటాల తహసీల్దార్ ఇందారపు పుష్పలత 144 సెక్షన్ అమలుచేసి ఒంటరిగా ఎవరు బయటకు రావొద్దని సూచించారు. అటవీ శాఖ అధికారులు ఏనుగును అదుపులోకి తీసుకొనేంత వరకు అందరు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు.

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో శుక్రవారం భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లయ్య, మొండయ్య, ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం జెండా వందనం కార్యక్రమంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆసిఫాబాద్ : బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఘనంగా సింగిల్ విండో చైర్మన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమన్ జన్మదిన సందర్భంగా ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అజ్మీర రాజేందర్, ఝాన్సీ, పావని, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దాస్‌పెల్లి శ్యామ్‌రావు, జాబరి రాజు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడులపై ఫోకస్..!

- మౌళిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి
- వేసవి సెలవుల్లో పనులు ప్రారంభించాలని నిర్ణయం
- పున: ప్రారంభంలోగా అందుబాటులోకి సౌకర్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలపై సర్కారు దృష్టిసారిస్తోంది. బడుల్లో మౌళిక వసతులు కల్పించాలని భావిస్తోంది. రానున్న విద్యా సంవత్సరంలోగా వీటిని అందుబాటులోకి తీసుకోవాలని యోచిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే ఏర్పాటుచేసిన అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే ఏయే పాఠశాలల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించాలనే నివేదికలు రూపొందించిన విద్యాశాఖ అధికారులు వాటికి అనుగుణంగా పనులు మొదలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మరికొన్ని రోజుల్లో ఈ విద్యా సంవత్సరం ముగియనున్న దృష్ట్యా రానున్న వేసవి సెలవుల్లో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఆయా పనులు పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు ప్రారంభిస్తోంది.



కెరమెరిలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల

నవతెలంగాణ - కెరమెరి

పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న సర్కారు బడులను బాగు చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా వివిధ రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటికే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటుచేసింది. వీటి ఆధ్వర్యంలోనే బడుల్లో అన్ని రకాల మౌళిక వసతులు కల్పించడంతో పాటు పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. దీంతో ఆయా పాఠశాలల్లో వివిధ రకాల సౌకర్యాలు కల్పించేందుకు గాను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ ఆధ్వర్యంలో ఉండే ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) ద్వారా తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, ఫ్యాన్లు, టేబుల్‌లు, ఇతరాత్ర సౌకర్యాలను సమకూర్చనున్నారు. కాగా స్కూళ్లలో చేపట్టే పనులకు సంబంధించి రూ.లక్షలోపు పనులకు ఎంపీడీవోలు, రూ.లక్ష దాటితే కలెక్టర్ల ద్వారా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిసింది. జిల్లాలో 984 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. ఆ కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మున్సిపల్, టీఎస్ఈడబ్ల్యూడీసీ, తాగునీటికి సంబంధించి మిషన్ భగీరథ అధికారులు ఆయా పాఠశాలలకు సంబంధించిన పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టనున్నారు.

వేసవి సెలవులు పూర్తయ్యేలోగా..!

వేసవి సెలవులు ప్రకటించగానే పనులు మొదలుపెట్టి, తిరిగి స్కూళ్లు తెరిచేలోగా పూర్తి చేయాలని అధికారులకు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పనులపై దిశానిర్దేశం చేశారు. మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు యాభై రోజుల పాటు స్కూళ్లకు సెలవులు ఉండనున్నాయి. ఆ సమయంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు చేపడితే తిరిగి స్కూళ్ల తెరిచేలోగా పూర్తి చేయవచ్చుని భావిస్తున్నారు.

సానిటేషన్ సిబ్బంది లేకపోవడమే సమస్య

గతంలో పాఠశాలల్లో సానిటేషన్ సిబ్బందిని నియమించుకుని వారి ద్వారా మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయించేవారు. అయితే గత ప్రభుత్వం సానిటేషన్ సిబ్బందిని తొలగించి పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆయా బాధ్యతలను అప్పగించింది. గ్రామాలలో పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో చాలా చోట్ల పంచాయతీలు పట్టించుకోవడంలేదు. పట్టణాల్లోనూ స్కూళ్లలో పారిశుధ్య నిర్వహణ తమది కాదన్నట్లుగానే బల్దియాలు వ్యవహరిస్తున్నాయి. దీంతో సర్కారు బడుల్లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తాగునీటి సరఫరాపై ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



పాల్గొన్న జిల్లా అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవిలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా జూన్ వరకు నిరంతరాయంగా నీటిని అందించేందుకు కార్యచరణ రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం వేసవి తాగునీటి నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 334 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీలున్నాయని, ఈనెల మొదటి వారం నుండి జూన్ వరకు జిల్లాలోని ప్రతి కుటుంబానికి తాగునీరు అందించేలా కార్యచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గృహాలు, జనాభా, నీటి అవసరాలు, నీరు అందని ఆవాసాలు, గృహాల వివరాల ప్రకారం అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించి సరిపడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో చేతిపంపులు, బోర్ వెల్స్, మంచినీటి బావుల ద్వారా నీటి లభ్యత గుర్తించాలని, వేసవి తీవ్రత దృష్ట్యా నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాలకు నీటి ట్యాంకుల ద్వారా, ట్యాంకులు వెళ్ళని ప్రాంతాలకు ఎడ్లబండిపై తీసుకువెళ్లి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీపీ పరిధిలోని వ్యవసాయ బావులు, బోర్ వెల్స్ వివరాలను అందించాలని, సూక్ష్మ ప్రణాళిక రూపొందించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. చేతి పంపులు, మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మత్తు చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ఆవాసాలను గుర్తించి నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని, మున్సిపాలిటీలలో ప్రణాళికల రూపొందించి అందించాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జన రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీలలో పశువుల దాహార్తి తీర్చే విధంగా నీటి తొట్టెలలో నీటిని నిండుగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి కొరత లేకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సక్రమంగా వినియోగించుకుని వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరికి సరిపడా నీటిని అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీఓ భిక్షపతి, మిషన్ భగీరథ ఈఈ. వెంకటపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా నీటిని అందించాలి

ప్రజలకు అందించే తాగునీటి సరఫరా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం మండలంలోని మాణిక్ గూడ గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా నిర్వహణను డివిజనల్ పంచాయతీ అధికారి అహ్మద్ ఒమర్ హుస్సేన్, డిప్యూటీ ఈఈ మథీన్ అహ్మద్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యే వరకు ప్రతి ఇంటికి సరిపడా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టమని తెలిపారు. గ్రామాలలో నల్ల కలెక్షన్లు, బోర్ వెల్స్ ద్వారా నీటిని అందిస్తామన్నారు. నీటి వనరులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడంతో పాటు అంగన్‌వాడి కేంద్రాలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో తాగునీటి సరఫరా, సమస్యలు, చేపట్టిన పరిష్కారాలపై ప్రతిరోజు నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈఈలు, పంచాయితీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాణిక్‌గూడలో చేతి పంపు మరమ్మత్తుల గురించి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

అటవీశాఖ అధికారుల తప్పిదం వల్లే ఏనుగు దాడులు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు
- బాధిత కుటుంబాలను అటవీశాఖ మంత్రి పరామర్శించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

అటవీశాఖ అధికారుల తప్పిదం వల్లే ఏనుగు దాడులు జరిగాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. గురువారం మండలంలోని బూరేపల్లి గ్రామంలో ఏనుగు దాడిలో మరణించిన అల్లూరి శంకర్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ అధికారుల సమన్వయ లోపంతో కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో రెండు నిండు ప్రాణాలను ఏనుగు బలిగొన్నదన్నారు. మహారాష్ట్ర మాదిరిగా చనిపోయిన కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఏనుగును తిరిగి ఛత్తీస్‌ఘడ్‌లోని అటవీ ప్రాంతాలకు పంపించడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. అటవీ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఏనుగు దాడిలో చనిపోయిన కుటుంబాలను పరామర్శించి భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, అజ్మీరా బలరాం, టకిరే శంకర్, తిప్పర్తి శంకర్, కుకుడ్‌కార్ రమేష్, దన్నూరి సాయికృష్ణ ఉన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

- రెండు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బంది పడుతున్న రెండు గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం రూ.వేలకోట్లు వెచ్చించింది. ప్రజల కోసం ఇంత ఖర్చు చేసిన సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలకు ఉపయోగ పడకుండా పోతోంది. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్కార్ పథకాలు ప్రవేశపెడితే క్షేత్రస్థాయిలో అందడం లేదు. మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. మండలంలోని డబ్బా, బారెగూడ గ్రామాల మధ్యలో వాగు ఒడ్డు సమీపంలో ప్రధాన రహదారి ప్రక్కన పైపు లైన్ లీకేజీతో పలు గ్రామాలకు తాగు నీరు సరఫరా కావడం లేదు. తాగు నీరు అందకా ఆయా గ్రామల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులకు, పాలకులకు గ్రామస్తులు తెలియజేసిన ప్రజలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ఇప్పుడే బావిలలో నీళ్ళు ఎండిపోయి నీటి కష్టాలు ఎదుర్కొంటున్నమని, అలాంటి సమయంలో రెండు రోజుల నుంచి నీళ్ల రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు పైప్ లైన్ మరమ్మత్తు చేసి రెండు గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



నాలుగేండ్లుగా భూసార పరీక్షలు లేక ఇబ్బందులు

నవతెలంగాణ-వాంకిడి

అధిక సాగు చేసేందుకు భూసార పరీక్షలు చేసుకోవాలని అధికారులు, ప్రభుత్వం పదేపదే చెబుతుంది. కానీ మండలంలో గత నాలుగేండ్లుగా భూసార పరీక్షలు నిర్వహించకపోవడంతో పంటలు పండించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తగిన రసాయనాలు నిల్వ ఉంచేందుకు మట్టి స్వభావం ఆధారంగా పంటలు పండించేందుకు భూసార పరీక్షలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయి. కానీ అధికారులు మాత్రం భూసార పరీక్షలు నాలుగేండ్లుగా చేయడంలేదు. దీంతో నేల సారవంతంపై అవగాహన లేకుండా రైతులు ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీని ఫలితంగా పెట్టుబడి వ్యయం పెరిగి పోషకాలు తగిన రీతిలో అందక భూసారం తగ్గిపోయి అధిక దిగుబడి రావడం లేదు. పంటలు పండించుకోవడానికి వేసవి కాలం అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ క్లస్టర్ల వారీగా గత ప్రభుత్వం 70 రైతు వేదికలను నిర్మించింది. ఒక్కో వేదికలో భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో పనులు కాలేదు. 2018లో భూసార పరీక్షలు చేసేందుకు రూ. 1.30 లక్షలతో వ్యవసాయ పరికరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించారు. అప్పటిలో రైతులు వేదికలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయంలో పరికరాలను ఒక మూలకు ఉంచి పరీక్షలు నిర్వహించారు. రైతువేదికలు నిర్మించిన ఈ కిట్ల పరికరాలను అందులోకి మార్చారు. 2020 వరకు పరీక్షలు సహజంగా జరిగిననంతరం రసాయనాలు లేక పరికరాలన్నీ మూలకు పడేశారు. ఇప్పటికైనా భూసార పరీక్షలు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

జనజీవన స్రవంతిలో కాలవాలి

ఆదిలాబాద్‌టౌన్ : మావోయిస్టులు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో గడపల్సిన విలువైన సమయం, ఆరోగ్యం, ఆనందాన్ని కోల్పోవడం తప్ప సాధించిందేమీ లేదన్నారు. ఇక మిగిలిన జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలోనిమైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ పోచ్చురా గ్రామం బోథ్ మండలం, దాసరి వార్ సుమన సంగీతక్క, డెడ్రా గ్రామం బజార్హత్నూర్ మండలం, వీరు జనంలోకి రావడానికి పోలీసులు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేశారు. మావోయిస్టులు వనాన్ని వదిలి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే అన్ని రకాల ప్రతిఫలాలను అందజేసి, పునరావాసం కల్పించే విధంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. అడవుల్లో ఉండే గిరిజనులకు విద్య, వైద్యం, ఆర్థిక స్వావలంబన అందకుండా, పురోగతికి, అభివృద్ధికి అడ్డుపడకుండా, ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని జనజీవన స్రవంతిలో కలవాలన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే గురువారం స్థానిక మసీదులో ఇఫ్తార్ విందు చేశారు. ముస్లిం సోదరులు కఠినమైన ఉపవాసాల దీక్ష చేస్తూ రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఈఓపీఆర్డీ రమేశ్ ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని లోతర్రె గిరిజన గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామన్నారు. నీటిని వృథా చేయకుండా సక్రమంగా వాడుకోవాలన్నారు. మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భంలో చిన్నారులు, వృద్ధులు మధ్యాహ్నం బయటికి వెళ్ళకూడదని హెచ్చరించారు. లోతర్ర గ్రామంలో ఉన్న 4 పెద్ద మంచినీటి బావులను పరిశీలించారు. నీటి సరఫరాను ప్రజలకు అందించడానికి ఆ బావుల యజమానులతో చర్చించామన్నారు. వారి అనుమతి తీసుకొని ప్రజలకు ఆ బావుల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామన్నారు. ప్రజలు తమకు సహకరించాలనికోరారు.

'బీజేపీ ప్రజా సంక్షేమానికి పాటుపడుతోంది'

నవతెలంగాణ-జన్నారం

ప్రజా సంక్షేమానికి పాటుపడుతోంది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రీ నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, బీజేపీ జిల్లా నాయకులు కొంతం శంకరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాంగ్రెస్ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వంశీ అన్న యువసేన జిల్లా అధ్యక్షుడు దమ్మ సునీల్ ప్రజలను కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీ కుటుంబం ఆయన తాత వెంకటస్వామి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు.

వాహన తనిఖీల్లో రూ.1.33 లక్షలు స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మావల బైపాస్ వద్ద రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వర్యంలోని బృందం ఆకస్మిక వాహన తనిఖీ నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ తనిఖీలో ఇంద్రవెల్లికి చెందిన సంతోష్ వద్ద రూ.62 వేలు, తిరుపతి వద్ద రూ.71,500 పత్రాలు లేకుండా తరలిస్తుండగా సీజ్ చేశారు. వీటిని వెంటనే ఎఫ్ఎస్‌టీ బృందం ద్వారా జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా గోశాలకు విరాళం

నవతెలంగాణ-కుభీర్



కుబీర్ మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన ఓమొల్ల సంతోష్ తన కుమార్తె శ్రీనిక జన్మదినాన్ని పురస్కరించుకొని రూ.5 వేలు బైంసా పట్టణంలోని గోశాల నిర్వాహకులు గురువారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా తండ్రి సంతోష్ మాట్లాడుతూ తన కూతురు శ్రీనిక జన్మదిన సందర్భంగా గోశాలకు తన వంతు సహకారం అందించినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని 3వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ సాయి ప్రణయ్ గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఆయనతో పాటు తిలక్‌నగర్, ఖానాపూర్ కాలనికి చెందిన శంకర్, అభుజర్, షేక్ ఫరీద్ చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతివెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో అమృత ధార

రాష్ట్రంలో ఎండలు మండుతున్న తరుణంలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి అటవీ శాఖ అధికారులు ఆధునాతన పద్ధతులను చేపడుతున్నారు. గతంలో కుంటాలు వర్షపు నీటితోనే నిండేవి. అయితే ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండ తీవ్రత అధికం కావడంతో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. అటవీ శాఖ అధికారులు దీన్ని అధిగమించేందుకు సోలార్ ప్లేట్లతో బోర్ మోటర్లు ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసి వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నారు.

- అభయారణ్యంలో సోలార్ ప్లేట్లతో బోర్ మోటార్లు
- వన్యప్రాణులకు నీటి ఎద్దడి లేకుండా అధికారుల చర్యలు
- జిల్లాలో 187 కుంటలు, 24 సోలార్ బోర్లు



వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి గుంట

నవతెలంగాణ-జన్నారం

అభయారణ్యంలోని వన్యప్రాణుల నీటి సౌకర్యం కోసం అధికారుల ప్రత్యేక శ్రద్ధతో అధునాతన పద్ధతిని ఉపయోగించి ఉమ్మడి సోలార్ ప్లేట్లతో బోర్లు తవ్వించి మోటర్లకు సోలార్ పవర్ కనెక్షన్ ఇచ్చి పైపుల ద్వారా నీటిని నిల్వ చేస్తూ వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నారు. ప్రతి రెండు కిలో మీటర్ల పరిదిలో గ్రిడ్ ఏర్పాటు చేసి వన్యప్రాణుల కోసం 24 గంటలపాటు నీరుండేలా ప్రత్యేక చొరువ చూపుతున్నారు. మూగ జీవుల పట్ల ఉదారతను చాటుతున్న అటవీ అధికారులు, కవ్వాల పులుల అభయారణ్యంలోని జన్నారం డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో 187 కుంటలు, 23 సోలార్ బోర్లు, 23 రాంపేల్స్, తాళ్లపేట రేంజ్‌లోని పాత మామిడిపెల్లి అటవీ ప్రాంతంలో ఒక చెక్ డ్యాం, 80 సాసర్ ఫిట్స్, 44 నేచురల్ వాటర్ హోల్స్, 25 చెలిమేలు, 9 హండ్ పంపులు ఏర్పాటు చేశారు. ఈ నెలలో ప్రస్తుతం ఆరు కొత్త అధునాతన పద్ధతిలో సోలార్ విద్యుత్‌తో 6 బోర్ వేల్స్‌లను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేరకు 6 బోర్ వేల్స్‌లను నిర్ధేత అటవీ ప్రదేశంలో వేశారు. వాటికి సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నారు.



రెండు కిలోమీటర్లకు గ్రిడ్

అభయారణ్యంలోని అడవుల్లోని నీల్గాయిలు, చుక్కల జింకలు, అడవి పందులు, కుందేల్లు, నేమల్లు, అడవీ బర్రేలు, చిరుత పులులు, ఎద్దులు, కొండ గోర్రేలు, ఎలుగు బంట్లు తదితర వన్యప్రాణులు ఎక్కువగా ఉన్నాయి. ఆ వన్యప్రాణులకు సరిపడా 24 గంటల నీరు ఉండటం కోసం అడవుల్లో ప్రతి 2కిలో మీటర్ల గ్రిడ్ పరిధిలో ఉన్న వన్యప్రాణుల కోసం నీటి వసతులు ఏర్పాటు చేశారు.



నిరంతరం ఆయా రేంజ్ ఆఫీసర్లు కె.లక్ష్మినారాయణ, ఎండీ హఫీజోద్దిన్, సుష్మారావు పర్యవేక్షణలో సేక్షన్, బీట్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలలో 44 నేచర్ వాటర్ హోల్స్‌లలో నిత్యం నీరు వచ్చేలా ఏర్పాటు చేశారు. అభయారణ్యంలోని అడవుల్లో వన్యప్రాణుల కోసం రాక్ సాల్ట్‌తో సాల్ట్ లిక్స్‌లు ఏర్పాటు చేసి ఆ వన్యప్రాణులు నాకే లాగా పలు చోట్ల ఏర్పాటు చేశారు. రాక్ సాల్ట్‌తో చేసిన సాల్ట్ లిక్స్‌ను వన్యప్రాణులు నాలుకతో రాక్కుంటూ తినడం వల్ల నాలుకపై గల ఇన్‌ఫెక్షన్లు, పెరిగిన స్వేధ గ్రంధులు విస్తరించి నీటిని ఎక్కువ తాగుతూ అడవుల్లో గడ్డి, ఇతర వాటిని తింటూ ఆరోగ్యంగా ఉండటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతానికి వచ్చిన వన్య ప్రాణులు నీటిని తాగి అక్కడే పడుకుని సేద తీర్చుకుంటున్నాయి. మే, జూన్ నెలలో నీటి కోరత కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకే..

శివ్ ఆశిష్‌సింగ్, డీఎఫ్ఓ, మంచిర్యాల



వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వన్యప్రాణుల నీటి వసతి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం అడవుల్లోని వన్యప్రాణులకు 2 కిలోమీటర్లలో గ్రిడ్‌గా ఏర్పాటు చేసి నీరు లభించేలా ఏర్పాట్లు చేశాం. ఈ నెలలో ఎక్కడ చూసినా ఆ పరిధిలో వన్యప్రాణులకు నీరు లభిస్తుంది. కవ్వాల అభయారణ్యంలోని జన్నారం డివిజన్‌లోని తాళ్లపేట, ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్ల పరిధిలోని అడవుల్లో 6 సోలార్ ప్లాంట్లతో బోర్ వేల్స్ ఏర్పాట్లు చేయనున్నాం. అటవీ ప్రాంతాల్లో 6 బోర్ వేల్స్ నిర్మాణం పూర్తి చేశాం. అడవుల్లోని వన్యప్రాణులకు నీటి కొరత లేకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నాం.

తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్
- సంబంధిత అధికారులతో సమావేశం





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టాలని తాగునీటి పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. ప్రతి గ్రామానికి తాగు నీటి సరఫరా కార్యాచరణ రూపకల్పన చేపట్టాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహ, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు కలెక్టర్, ఐటీడీఏ పీఓ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ మండలాల వారిగా నియమించిన ప్రత్యేక అధికారులు రోజూ ఫీల్డ్ లో ఉండి పర్యవేక్షించాలని అన్నారు. హబిటేషన్ వారిగా రోజుకు 4,5 జీపీలను పరిశీలించి నీటి సమస్య కు గల కారణాలను తెలుసుకొని నివేదిక తయారుచేసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజుల కొకసారి నీటి సరఫరా అవుతున్న హబిటేషన్‌ల వివరాలు సమర్పించాలని అన్నారు. ముఖ్యంగా నీటి సమస్య



ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని, ఆదిలాబాద్ రూరల్, తాంసి, తలమడుగు, ఇంద్రవెల్లి, బోథ్, బజార్‌హత్నూర్, తదితర మండలాల్లో సమస్య ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేక శ్రద్ధ వహించి , పంచాయితి అధికారి, డీఎల్పీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయితి కార్యదర్శి ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండి ప్రతి రోజు అక్కడి నీటి సమస్యను గుర్తించి డైరీలో రాయాలన్నారు. బోర్ వెల్స్, మిషన్ భగీరథ నీరు, ఇంట్రా, పైప్ లైన్, సంబందించి రిపేర్ వర్క్స్, మేజర్ ప్రాబ్లమ్స్ తదితర అంశాలపై అంచనాల ప్రతిపాదనలను సోమవారంలోగా పంపాలని, గ్రామాల్లో ప్రజలు ఎవరు కూడా బావి దగ్గరకు వెళ్లి నీరు తీసుకోకూడదని ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి నీటిని సరఫరా చేయాలని అన్నారు. ఈ సమీక్షలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై చర్యలు

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్

ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలం గంజాల్‌లోని రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లింగ్ ప్రక్రియను, ధాన్యం నిల్వలు, శుభ్రతను పరిశీలించారు. మిల్లు కెపాసిటీ, లేబర్, రోజువారీ మిల్లింగ్ వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లు నిబంధనలను తప్పనిసరి పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. మిల్లులో శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి మిల్లును తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఎస్ఓ నందిత, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరాగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాది హక్కుల దండోరా జిల్లా ఉపాధ్యక్షులు జనం పెల్లి బాణేష్, వెంకట్‌రావుపల్లి మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి తిరుమల వాసు, వార్డు సభ్యులు జాడి రవి తదితరులున్నారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ బలోపేతం కోసం పని చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణ రెడ్డి, గంగిపల్లి మాజీ సర్పంచ్ లింగారెడ్డి, జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, శీలం వెంకటేశం, సంపత్ రెడ్డి, శ్రీకాంత్, అంబల్ల రవి, కలికి రమేష్ ఉన్నారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు అద్దంకి దయాకర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజా సంక్షేమం కోరుకొనే నిస్వార్థ ప్రజా సేవకుడు అద్దంకి దయాకర్ అని మాల మహానాడు మండల అధ్యక్షులు మాలెం చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు డా. అద్దంకి దయాకర్ 53వ జన్మదిన సందర్భంగా పట్టణంలోని విశ్రాంతి భవనంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంతో పని చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. అరుదుగా ఉండే ప్రజా నాయకుల్లో ఒక గొప్ప నాయకుడు అద్దంకి దయాకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దమ్మ నారాయణ, జిల్లా నాయకులు దొంత నరసయ్య, మినుముల శాంతి కుమార్, గుత్తికొండ శ్రీధర్, బైరం రవి, మండల మహిళ అధ్యక్షురాలు పెండెం శ్రీలత, ప్రధాన కార్యదర్శి పెండెం లక్ష్మీ, యూత్ అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు తొగరి రాజు, పెండెం రాజశేఖర్, అంజి పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి ప్రారంభించారు. మండలంలోని కలమడుగు, టీజీపల్లి, బాదంపల్లి, పోన్కల్, తదితర గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని మండల నూతన ఎస్సై రాజవర్ధన్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. అలాగే గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్సై సూచించారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

నవతెలంగాణ-జన్నారం

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జాడి నర్సయ్యను గురువారం ఆమె శాలువతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్ మహమ్మద్ రజాక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

